క్లుప్తంగా

ఎంపీడీవోగా ఆర్మ్‌స్ట్రాంగ్‌కు పదోన్నతి



రాజమహేంద్రవరం రూరల్: రూరల్ మండల డిప్యూటీ ఎంపీడీవో ఆర్మ్‌స్ట్రాంగ్‌కు ఎంపీడీవోగా పదోన్నతి లభించింది. ఈ మేరకు రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ వీఆర్ కృష్ణతేజ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఆర్మ్‌స్ట్రాంగ్ రూరల్ ఇన్‌చార్జి ఎంపీడీవోగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఆయనకు పదోన్నతి కల్పించి తూర్పుగోదావరి జిల్లాకే కేటాయించారు. ఈ సందర్భంగా ఆర్మ్‌స్ట్రాంగ్‌ను పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది అభినందించారు.

ఇసుక లారీలపై నిఘా



లారీపై పరిమితికి మించి లోడ్ చేసిన ఇసుక

సీటీఆర్ఐ: ఇసుక తరలింపులో నిబంధనలు పాటించని లారీలకు అధికారులు జరిమానా విధించారు. ఒక లారీని సీజ్ చేయడంతో పాటు మరో రెండింటికి జరిమానాలు విధించారు. వివరాల్లోకి వెళితే.. కలెక్టర్ ప్రశాంతి శుక్రవారం నగరంలోని పర్యటిస్తున్న సమయంలో పరిమితికి మించి ఇసుకతో వెళుతున్న లారీ కనిపించింది. దానిపై టార్పాలిన్ కూడా కప్పకపోవడంతో ఇసుక జారి పోతోంది. అలాంటి వాటిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంటనే రవాణా శాఖాధికారి సురేష్‌కు ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఆ లారీని అధికారులు సీజ్ చేశారు. మరో రెండు లారీలకు రూ.1.29 లక్షల అపరాధ రుసుం విధించారు.

ఘనంగా సర్వేపల్లి విగ్రహావిష్కరణ



రాధాకృష్ణన్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఆనంద్ కుమార్ తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: కొంతమూరు మండల ప్రజా పరిషత్ ప్రాథమిక మోడల్ పాఠశాలలో శుక్రవారం సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని పామర్తి నాగరాజు విరాళంతో ఏర్పాటు చేసిన ఈ విగ్రహాన్ని జోన్ చైర్మన్ ఆనంద్ కుమార్ ఆవిష్కరించారు. కొంతమూరు లయన్స్ క్లబ్ సౌజన్యంతో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం జరిగింది. పాఠశాల ప్రధానోపాధ్యాయిని మోహిని, ఉపాధ్యాయులను క్లబ్ మెంటార్ బాబు, సలాది శ్రీనివాస్, క్లబ్ కార్యదర్శి భాస్కరరాజు, కోశాధికారి శంకర్, సభ్యులు సత్కరించారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

రంగంపేట: అక్రమంగా విక్రయిస్తున్న మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు ఎక్సైజ్ సీఐ సుధ తెలిపారు. ఆమె శుక్రవారం సాయంత్రం మాట్లాడుతూ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని అనపర్తి మండలం పెడపర్తిలో దాడులు నిర్వహించామన్నారు. అక్కడి బెల్టు షాపుల్లో అక్రమంగా విక్రయిస్తున్న 51 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని, తేతల వీర్రాఘవరెడ్డిని అరెస్టు చేశామన్నారు.

సినిమాలు



శ్యామల :	ఘాటీ
సూర్యమినీ :	ది కంజ్యూరింగ్
సూర్యప్యాలెస్ :	ఘాటీ
స్వామి :	కూలీ
అనుశ్రీ :	మదరాసి
శివజ్యోతి :	ది బెంగాల్ ఫైల్స్
రాజా :	మదరాసి
ఊర్వశి :	లిటిల్‌హార్ట్స్
మేనక :	ది కంజ్యూరింగ్
రంభ :	మహావతార్ నరసింహ
అప్సర :	కొత్తలోక
అశోక :	మదరాసి
నామవరం	
వీఎస్ మహల్ :	ఘాటీ
ధవళేశ్వరం	
మురళీకృష్ణ :	ఘాటీ, మదరాసి
కడియం	
వెంకటసూర్య :	మదరాసి, ఘాటీ

క్రీడా మహేంద్రి

- నగరంలో పలు క్రీడా పోటీలు
- ఉమ్మడి జిల్లాకు వేదికగా మారిన వైనం
- 21 నుంచి బ్యాడ్మింటన్ టోర్నమెంట్

ప్రకాశం నగర్: రాజమహేంద్రవరం అంటే గలగల పారే గోదావరి, ప్రసిద్ధి చెందిన ఆలయాలు, సుందరమైన ప్రకృతి, రూ.కోట్లలో జరిగే వ్యాపార లావాదేవీలు, ఆధునాతన ఆస్పత్రులు గుర్తుకు వస్తాయి. రాజమహేంద్రవరం కేంద్రంగా నూతన తూర్పుగోదావరి ఏర్పడిన తర్వాత నగరం మరింత అభివృద్ధి చెందుతోంది. అలాగే సాంస్కృతిక రాజధాని అయిన రాజమహేంద్రవరం ఇప్పుడు క్రీడామహేంద్రిగా కూడా మారింది. ఇక్కడే పలు జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహిస్తున్నారు.

పలు పోటీలకు వేదిక..

ఉమ్మడి జిల్లా స్థాయిలో పలు క్రీడల పోటీలకు రాజమహేంద్రవరం వేదికగా మారింది. ఇప్పటికే వివిధ రకాల పోటీలను నిర్వహించారు. ఈ నెల 21 నుంచి 28 వరకు ఆల్ ఇండియా సీనియర్ ర్యాకింగ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు ఇటీవలే ప్రకటించారు. బొప్పన స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లోని సిటీ బ్యాడ్మింటన్ కోర్టులో బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, ఆంధ్రప్రదేశ్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ సంయుక్తంగా వీటిని నిర్వహించనున్నాయి. ఈ పోటీలకు పలు రాష్ట్రాలకు చెందిన సుమారు 1500 మంది క్రీడాకారులకు హాజరు కానున్నారు. దేశంలోనే అతి పెద్ద సీనియర్ ర్యాకింగ్ పోటీలు రాజమహేంద్రవరంలో నిర్వహించడం ఇదే తొలిసారి అని నిర్వాహకులు తెలిపారు. రెండు వేదికలపై నిర్వహించే ఈ పోటీలను కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, మంత్రులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, కందుల దుర్గేష్, ఎంపీ పురందేశ్వరి ప్రారంభించనున్నారు.

గత ఏడాది సౌత్ జోన్ బ్యాడ్మింటన్ పోటీలు

గత ఏడాది 78వ సౌత్ జోన్ ఇంటర్ స్టేట్ బ్యాడ్మింటన్ పోటీలను విజయవంతంగా నిర్వహించారు. అదే స్ఫూర్తితో ఇప్పుడు ఆల్ ఇండియా సీనియర్ ర్యాకింగ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఇప్పటికే ఊషు, టేబుల్ టెన్నిస్ రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు రాజమహేంద్రవరంలో జరిగాయి.



రాజమహేంద్రవరంలో జరిగిన రాష్ట్ర స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు (ఫైల్)

అంతంత మాత్రంగా మైదానాలు

నగరంలోని ఆర్ట్స్ కళాశాల, స్టేడియం, ఎస్‌కేవీటీలో క్రీడా మైదానాలు ఉన్నప్పటికీ వాటిలో సౌకర్యాలు మాత్రం అంతంత మాత్రంగా కనిపిస్తాయి. గత ప్రభుత్వం స్కూల్ గేమ్స్ ఆడుదాం ఆంధ్ర పేరుతో క్రీడా పోటీలను నిర్వహించి గ్రామీణ స్థాయిలో క్రీడాకారులను గుర్తించి వారికి మెరుగైన శిక్షణ ఇచ్చింది. గత ప్రభుత్వం తీసుకున్న ఈ చర్యలతో క్రీడాకారుల్లో వారి ప్రతిభకు పదునుపెట్టినట్లు అయ్యిందని క్రీడా విశ్లేషకులు చెబుతున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో క్రీడల ఊసే లేదని పలువురు పెదవి విరుస్తున్నారు.



ఊషు పోటీల్లో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న రౌతు సూర్యప్రకాశరావు (ఫైల్)

విద్యుత్‌కు నేడు అంతరాయం

కడియం: మురమండ విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మత్తుల నేపథ్యంలో పలు గ్రామాలకు శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఈఈ జేపీబీ నటరాజన్ తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ మురమండ, మాధవరాయుడు పాలెం, వీరవరం, దామిరెడ్డిపల్లి, దుళ్ల గ్రామాల పరిధిలోని వ్యవసాయ, గృహ వినియోగదారులకు సరఫరా ఉండదన్నారు.

వైద్య శిబిరం

కడియం: మండల కేంద్రమైన కడియంలో యువ నర్సరీ రైతు వెన్నపు మణికంఠస్వామి పుట్టిన రోజును పురస్కరించుకుని వైద్య శిబిరం నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర వైద్యవిభాగం కార్యదర్శి డాక్టర్ గోరంట్ల రవిరామ్ కిరణ్ ఈ శిబిరాన్ని ప్రారంభించారు. రాజమహేంద్రవరానికి చెందిన గాంధీ హాస్పిటల్, మహేశ్వరి డెంటల్ కేర్, సాహితి కంటి ఆసుపత్రి వైద్యులు సేవలందించారు. ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, వైఎస్సార్ సీపీ రాష్ట్రకార్యదర్శి గిరజాల వీర్రాజు, మండల టీడీపీ అధ్యక్షులు వెలుగుబంటి రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.

పోలవరం నిర్వాసితులకు నిత్యావసరాల పంపిణీ

రాజమహేంద్రవరం రూరల్: భారతీయ జీవిత బీమా సంస్థ 69వ బీమా వారోత్సవాలలో భాగంగా సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పోలవరం నిర్వాసితుల కుటుంబాలకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. దేవీపట్నం మండలం గానుగొలగొంది, మూలపాడు గ్రామాల్లో రాజమండ్రి ఎల్ఐసీ సీనియర్ డివిజనల్ మేనేజర్ సత్యనారాయణ సాహు, సర్పంచ్ కుంజం రాజమణి చేతుల మీదుగా వీటిని అందించారు. సత్యనారాయణ సాహు మాట్లాడుతూ వంద మంది నిర్వాసితులకు నిత్యావసరాలు పంపిణీ చేశామన్నారు. ప్రతి ఒక్కరూ ఎల్ఐసీ ద్వారా జీవితానికి బీమా రక్షణ కల్పించుకోవాలన్నారు. అలాగే ఎల్ఐసీ డివిజనల్ కార్యాలయంలో ఉద్యోగులకు క్విజ్, అంత్యాక్షరి పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో మార్కెటింగ్ మేనేజర్ వెంకటేశ్వర్లు, సేల్స్ మేనేజర్ ఎస్ఎస్ఎస్ శర్మ, గోకవరం బ్రాంచి మేనేజర్ డి.సూర్యనారాయణ, ఏబీఎం కోటేశ్వరరావు, మేనేజర్లు రేఖ, రంగనాయకులు, కిరణ్, సుధాకర్, కిశోర్ పాల్గొన్నారు.



నిత్యావసరాలు అందజేస్తున్న ఎల్ఐసీ సీనియర్ డివిజనల్ మేనేజర్ సత్యనారాయణ సాహు

రాజ్యాంగ పరిరక్షణ ర్యాలీని జయప్రదం చేయాలి

రాజమహేంద్రవరం సిటీ: జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరానికి ఆదివారం వస్తున్న రాజ్యాంగ పరిరక్షణ ర్యాలీని జయప్రదం చేయాలని జిల్లా మాల ఉద్యోగుల సంఘం చైర్మన్ ఎల్‌వీ ప్రసాదరావు పిలుపు నిచ్చారు. కార్పొరేషన్ ఎదుట గల అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్లో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గం నుంచి శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం వరకు రాష్ట్ర మాలల జేఏసీ ఆధ్వర్యంలో ఈ ర్యాలీ జరుగుతోందన్నారు. దీనిలో భాగంగా ఆదివారం సాయంత్రం నాలుగు గంటలకు నగరానికి చేరుకుంటుందన్నారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా క్రిమిలేయర్ రద్దు చేయాలని, ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్ అమలు చేయాలని, దళిత క్రైస్తవులకు రిజర్వేషన్ అమలు చేయాలని, పెరిగిన ఎస్సీ జనాభాకు అనుగుణంగా 20 శాతం రిజర్వేషన్ పెంచాలనే ముఖ్యమైన డిమాండ్లతో ఈ ర్యాలీ జరుగుతోందని ఆయన తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రసాదరావు

పుష్కరాలకు ఎమ్మెల్యేలతో కమిటీ వేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సానబోయిన రామారావు

సీటీఆర్ఐ: గోదావరి పుష్కరాలు విజయవంతంగా నిర్వహించేందుకు స్థానిక ఎమ్మెల్యేలతో కమిటీ వేయాలని, సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాసు, రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరిలకు కేబినెట్ హోదా పదవులు కల్పిస్తే 2015 నాటి దుర్ఘటన జరగకుండా నిరోధించవచ్చని రాష్ట్ర బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ సంఘం నాయకులు అన్నారు. నగరంలోని ఓ హోటల్లో ఆ సంఘ రాష్ట్ర వ్యవస్థాపకుడు సానబోయిన రామారావు అధ్యక్షతన శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2015లో జరిగిన తొక్కిసలాటలో 30 మందికి పైగా పుష్కర యాత్రికులు చనిపోయారని, ఆనాడు గోరంట్ల బుచ్చయ్య చౌదరి సలహాలు పెడ చెవిన పెట్టబట్టే ఆ దుర్ఘటన జరిగిందన్నారు. ఈ సారి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. తమ సంఘ ప్రతిపాదనలు పెడ చెవిన పెడితే నవంబర్ 24 నుంచి ఆందోళన చెపడతామని హెచ్చరించారు. సంఘం వైస్ చైర్మన్ ఎల్‌వీ ప్రసాద్ మాట్లాడుతూ గోదావరి జలాలు కలుషితం కాకుండా శాశ్వత పరిష్కారం చూపించాలన్నారు.

గడువులోపు పనులు పూర్తి చేయాలి

రాజమహేంద్రవరం సిటీ: నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులను గడువులోపు పూర్తి చేయాలని కలెక్టర్, ఇన్‌చార్జి కమిషనర్ పి.ప్రశాంతి అన్నారు. ఆమె శుక్రవారం పద్మావతి నగర్, హుకుంపేట ప్రాంతాలను సందర్శించారు. ముందుగా పద్మావతి నగర్ పార్కును పరిశీలించి, అక్కడ ఉన్న స్విమ్మింగ్ పూల్ నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. హుకుంపేటలో నిర్మాణంలో ఉన్న 50.6 ఎంఎల్‌డీ సివరేజీ ట్రీట్మెంట్ ప్లాంట్ పనులను పరిశీలించారు. ఆ పనులను డిసెంబర్ నాటికల్లా పూర్తి చేయాలని ఆదేశించారు. ఆమె వెంట ఎస్ఈ (ఇన్‌చార్జి) రీటా, డీఈ లోవరాజు, ఇంజనీరింగ్ సిబ్బంది ఉన్నారు.



స్విమ్మింగ్ పూల్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

ధర్మేష్‌కు జాస్తి యువకవి పురస్కారం

రాజమహేంద్రవరం రూరల్: గురువు మార్గదర్శి అయితే విద్యార్థికి మంచి భవిష్యత్తు ఉంటుందని శ్రీమతి జాస్తి బుల్లెమ్మ డిగ్రీ కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ జాస్తి జనార్దనమూర్తి అన్నారు. కళాశాలలో శుక్రవారం జరిగిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ధర్మేష్‌కు జాస్తి యువకవి పురస్కారం అందజేశారు. గురుబోధన పేరుతో సాహితీ గోదావరి సంస్థ ఏర్పాటు చేసిన కవి సమ్మేళనంలో సభ్యులు ఆర్‌వీవీ రాజు, గరగ రామకృష్ణ, డాక్టర్ రజనా జానకిరామ్, డాక్టర్ పేరమాంబ, డాక్టర్ ర్యాలి శ్రీనివాస్, జేడీ వరలక్ష్మి, బుగత యమున, నక్కిన ధర్మేష్ కవితలు చదివి వినిపించారు. కళాశాల డైరెక్టర్ చిట్టూరి వెంకట్ కళాశాల తరఫున అధ్యాపకులను సత్కరించారు. ప్రిన్సిపాల్ జయ రమాదేవి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు.



ధర్మేష్‌కు జాస్తి యువకవి పురస్కారం అందజేస్తున్న జనార్దనమూర్తి

వృద్ధులకు పింఛన్ల పంపిణీ

సీటీఆర్ఐ: ఎస్‌కేవీటీ డిగ్రీ ప్రభుత్వ కళాశాలలోని ఆనంద్ గార్డెన్స్ వద్ద వాకర్స్ యోగా, లాఫింగ్ క్లబ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం 80 మంది వృద్ధులకు ఒక్కొక్కరికి రూ.500 చొప్పున పింఛన్లు పంపిణీ చేశారు. పదో తరగతి చదువుతున్న పేద విద్యార్థికి రూ.8 వేలను క్లబ్ తరఫున అందించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన విశ్రాంత ఉపాధ్యాయులను సత్కరించారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉపాధ్యాయుడు మొల్లేటి సూర్యనారాయణ మాట్లాడుతూ క్లబ్ అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో క్లబ్ వ్యవస్థాపకుడు పామర్తి గోపాలరావు, క్లబ్ అధ్యక్షుడు శనపతి సత్తిబాబు, క్లబ్ సెక్రటరీ గుబ్బల గంగాభవాని, విశ్రాంత ఉపాధ్యాయులు తాళ్లూరి సునీల్ కుమార్, షేక్ మదీనా బాషా పాల్గొన్నారు.



విశ్రాంత ఉపాధ్యాయులను సత్కరిస్తున్న క్లబ్ సభ్యులు

కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలి

ప్రకాశం నగర్: కార్పొరేట్ కంపెనీలకు ఆగమేఘాల మీద జీవోలు ఇస్తున్న కూటమి ప్రభుత్వం.. కార్మికులకు కనీస వేతనాలు ఇచ్చేందుకు చర్యలు చేపట్టాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు టి.అరుణ్ డిమాండ్ చేశారు. శ్యామలా సెంటర్‌లో సంఘ అధ్యక్షుడు సుందర్ బాబు అధ్యక్షతన శుక్రవారం సీఐటీయూ జిల్లా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అరుణ్ మాట్లాడుతూ బహుళ జాతీ కంపెనీ అయిన బెస్ట్ ప్రైజ్ సంస్థ రాత్రి 11 నుంచి ఉదయం 6 గంటల వరకు లోడింగ్, అన్ లోడింగ్, బిల్లింగ్ వంటి కార్యకలాపాలు నిర్వహించుటకు కూటమి ప్రభుత్వం జీవో విడుదల చేసిందన్నారు. గత 12 సంవత్సరాలుగా కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాల కోసం ప్రభుత్వానికి ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసిన పట్టించుకోలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా పనిచేస్తుందన్నారు.

రోగి బంధువు అసభ్య ప్రవర్తన

కంబాలచెరువు: ప్రభుత్వాసుపత్రిలో పారిశుధ్య కార్మికురాలితో రోగి బంధువు అసభ్యకరంగా ప్రవర్తించిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. పారిశుధ్య కార్మికురాలు ఆసుపత్రిలో తడిబట్టతో నేలను శుభ్రం చేస్తుండగా, అటుగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగి బంధువు వెళ్లాడు. అతడు శుభ్రం చేసిన నేలను తొక్కుకుంటూ వెళ్లిపోతుండగా.. పక్క నుంచి వెళ్లాలని ఆమె చెప్పింది. దీంతో సదరు వ్యక్తి ఆమెతో అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో పారిశుధ్య కార్మికులు ఆసుపత్రి వద్ద ధర్నా చేశారు. ఈ ఘటనపై మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఏఎస్పీగా శ్రీనివాస్‌కు పదోన్నతి

కంబాలచెరువు: హోంగార్డు డీఎస్పీగా పనిచేస్తున్న కేఎస్ఎన్ శ్రీనివాస్‌కు ఏఆర్ ఏఎస్పీగా పదోన్నతి లభించింది. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో శ్రీనివాస్‌ను శుక్రవారం ఎస్పీ డి.నరసింహ కిశోర్ అభినందించారు. ఏఎస్పీగా పదోన్నతి లభించడంతో ఆయన నంద్యాల జిల్లాకు బదిలీపై వెళుతున్నారు.

అన్న సమారాధన

ధవళేశ్వరం: గ్రామంలోని రథం వీధి ఫ్రెండ్స్ సర్కిల్ నాయకుడు యడ్ల మహేష్ ఆధ్వర్యంలో రథం షెడ్డు సమీపంలో ఏర్పాటు చేసిన కాణిపాకం వినాయక మండపం వద్ద శుక్రవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. వేల మంది భక్తులు తరలివచ్చి, అన్న ప్రసాదం స్వీకరించారు. తొలుత ఉదయం యడ్ల మహేష్ దంపతులు గణపతి హోమం నిర్వహించారు. ధవళేశ్వరం సీఐ టి.గణేష్, ఎస్సై హరిబాబు అన్నసమారాధనలో భక్తులకు వడ్డించారు. కార్యక్రమంలో రథం వీధి ఫ్రెండ్స్ సర్కిల్ సభ్యులు పాల్గొన్నారు.

పోలీసులకు సహకరించాలి

కడియం: వినాయక విగ్రహాల నిమజ్జనాలను నిబంధనల ప్రకారం నిర్వహించుకోవాలని కడియం ఇన్‌స్పెక్టర్ అల్లు వెంకటేశ్వరరావు కోరారు. ఈ మేరకు ఆయన శుక్రవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఉత్సవ ఊరేగింపుల్లో డీజేలకు అనుమతుల్లేవన్నారు. పటాసులు కాల్చరాదని, మద్యం, మత్తు పానీయాలు తాగి ఉత్సవాల్లో పాల్గొనరాదన్నారు. ఊరేగింపు మార్గంలో ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా కమిటీలు జాగ్రత్తలు పాటించాలన్నారు. నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

మహ్మద్ ప్రవక్త బోధనలు మార్గదర్శకం



నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

సీటీఆర్ఐ: మహ్మద్ ప్రవక్త బోధనలు మానవాళికి మార్గదర్శకమని వక్ఫ్ బోర్డు జిల్లా మాజీ చైర్మన్ మహ్మద్ ఆరీఫ్ అన్నారు. మిలాద్ ఉన్ నబీని పురస్కరించుకుని శుక్రవారం నగరంలో ముస్లింలు శాంతి ర్యాలీ నిర్వహించారు. నగరంలోని సున్నీ మసీదుల ఇమామ్‌లు, కమిటీ సభ్యులు, ముస్లిం ప్రముఖుల ఆధ్వర్యంలో ఆజాద్ చౌక్ సెంటర్ నుంచి ఆరంభమైన ర్యాలీ.. అప్సర థియేటర్, డీలక్స్ సెంటర్, మెయిన్ రోడ్డు, పుష్కర ఘాట్, దేవీ చౌక్, కంబాల చెరువు, మల్లయ్యపేట, క్వారీ సెంటర్, రామాలయం జంక్షన్, ఆర్టీసీ కాంప్లెక్స్ మీదుగా సాగుతూ దానవాయిపేట మసీదు వద్ద ముగిసింది. అక్కడ ఏర్పాటు చేసిన విందులో సుమారు 3 వేల భోజనాలు చేశారు. రాయల్ మసీదు ఇమామ్ అబ్దుల్ హఫీజ్ ఖాన్, లాల్ ఖాన్, డిల్లు, మల్లయ్య పేట మసీదు అధ్యక్షులు బషీర్, రబ్బానీ, మహ్మద్ షబ్బీర్, మహ్మద్ బషీర్, జిలానీ, ఆరీఫుల్లాఖాన్, మహబూబ్ పాల్గొన్నారు.

సమాజంలో గురువులకు ఎంతో ప్రాధాన్యం



కలెక్టర్ ప్రశాంతి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న సీహెచ్ సీతాలక్ష్మి



అవార్డులతో అర్బన్ మండల ఉపాధ్యాయులు



డైట్‌లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్ ఆర్‌జేడీ రాజు

కంబాలచెరువు: సమాజంలో ఉపాధ్యాయుని పాత్ర ఎంతో కీలకమైనదని జిల్లా విద్యాశాఖ అధికారి కంది వాసుదేవరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో శుక్రవారం మండల స్థాయి ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. డీఈవో మాట్లాడుతూ ఉపాధ్యాయునికి అవార్డులు ప్రోత్సాహాన్నిస్తాయన్నారు. అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్ కుమార్ మాట్లాడుతూ అర్బన్ మండలంలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల నుంచి దాదాపు 40 మందిని మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక చేశామన్నారు. కార్యక్రమంలో అర్బన్ ఎంఈఓ – 2 రమారజని, సీఆర్ఎంటీలు జయంతి శాస్త్రి, జె.శ్రీనివాసరావు, పబ్బిసీడి ప్రసాద్, కుమారి, ఇందిర, నాగలక్ష్మి, కోటేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

విద్యావ్యాప్తికి గంగిరెడ్డి కృషి



ఎస్పీ గంగిరెడ్డిని సత్కరిస్తున్న విశ్వేశ్వరరెడ్డి

రాజమహేంద్రవరం సిటీ: విద్యార్థులు భవిష్యత్తును తీర్చిదిద్దడంతో పాటు విద్యావ్యాప్తికి ఉపాధ్యాయుడు, ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్ ఎస్పీ గంగిరెడ్డి అద్భుత కృషి చేస్తున్నారని రాజమహేంద్రి విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ టీకే విశ్వేశ్వరరెడ్డి కొనియాడారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గంగిరెడ్డిని సత్కరించారు. కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో బొమ్మూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల ఉపాధ్యాయిని సీహెచ్ సీతాలక్ష్మి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు.

డైట్‌లో..

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని జిల్లా ప్రభుత్వ విద్యాశిక్షణ సంస్థ (డైట్)లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. డైట్‌లో పనిచేసి ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన ఎస్ఆర్ సుబ్రహ్మణ్యం, డాక్టర్ ఎ.రామకృష్ణారావు, డైట్‌లో సీనియర్ గణిత అధ్యాపకులుగా పనిచేస్తున్న కేవీ సూర్యనారాయణలను సత్కరించారు. క్రీడా దినోత్సవ సందర్భంగా జరిగిన పోటీలలో విజేతలకు ప్రిన్సిపాల్ ఆర్‌జేడీ రాజు, ముఖ్య అతిథులు బహుమతులు అందజేశారు.